క్లుప్తంగా

క్షయ రోగులకు వైద్య పరీక్షలు

పెరవలి: క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం మండలంలోని కానూరు, నడుపల్లి గ్రామాల హెల్త్ క్లినిక్‌లలో కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.తేజశ్రీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ జి.సందాని, ఎం. సులోచన, జి ఆశాజ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఆపద మిత్రలకు నల్లజర్లలో సత్కారం

నల్లజర్ల: 'ఆపదలో ఉన్న వారిని రక్షించడం ఎలా? అనే అంశంపై మండలంలోని ప్రకాశరావుపాలెం, దూబచర్ల ఆశ కార్యకర్తలు మారిశెట్టి వాణి, ఈపిచర్ల వెంకటదుర్గ 12 రోజుల పాటు శిక్షణ పొందారు. ఈ శిక్షణలో వారిద్దరూ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఆపద మిత్ర ఆవార్డులు అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్ తెల్లం గంగాధరరావు, సీహెచ్‌ఓ చంద్రశేఖరాజు మంగళవారం వారిద్దరిని సత్కరించారు. మిగతా వారందరూ వాణి, వెంకటదుర్గలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి మంచిపేరు తీసుకు వచ్చారని ప్రశంసించారు.కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు,వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి కంటి పరీక్షలు

చాగల్లు: స్థానిక కాకతీయ కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నిడదవోలుకు చెందిన రాజరాజేశ్వరి లయన్స్ కంటి అస్పత్రి వైద్యులు 150 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో కళ్లజోళ్లు అవసరమైన 35 మందికి వాటిని ఉచితంగా పంపిణీ చేశారు.15 మంది కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

కొవ్వూరు: వేములూరు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక సోమవారం రాత్రి నుంచి కనిపించడం లేదంటూ ఆమె తండ్రి కొవ్వూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై డి.నాగభూషణం తెలిపారు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

గృహ ప్రవేశం చేయకుండానే ఇంట్లో చోరీ

నల్లజర్ల: ఇంటిని కొత్తగా నిర్మించుకున్నాడు. బుధవారం గృహప్రవేశం చేస్తారు. ఆ ఇంట్లో అమర్చిన కొత్త టీవీని దొంగలు ఎత్తుకెళ్లారు. మండలంలోని దూబచర్ల వైఎస్సార్ వసంత్‌నగర్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై గృహ యజమాని బూరుగుపల్లి రాజారావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను నిర్మించుకున్న కొత్త ఇంట్లో బుధవారం గృహ ప్రవేశం చేయడానికి ముందే సోమవారం రాత్రి 43 అంగుళాల కొత్త టీవీని అమర్చారు.అదే రోజు రాత్రి దుండగులు తాళాలు పగలగొట్టి ఆ టీవీని ఎత్తుకెళ్లారు.రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. క్లూస్‌టీఎం వారు వేలిముద్రలు పరిశీలించినట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు.

07జీఓపి45–టీవీ చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలను పరిశీలిస్తున్న నిపుణులు

మృతదేహం వెలికితీత



స్నానఘట్టంలో పడి ఉన్న మృతదేహం

కొవ్వూరు: పట్టణ శివారున శ్రీనివాస స్నాన ఘట్టం వద్ద రావణ బ్రహ్మ విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. టీ షర్టు, లుంగీ ధరించి శవం బోర్లా పడి ఉంది. ఆ వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఉండవచ్చునని భావిస్తున్నట్లు ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. వీఆర్వో లూథ్ పాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బాల్య వివాహం: ముగ్గురిపై కేసు

కొవ్వూరు: మైనారిటీ తీరకుండానే 15 ఏళ్ల బాలికకు వివాహం జరిపించిన వారిపైన, వివాహం చేసుకున్న యువకుడిపై కొవ్వూరు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలివి. మండలంలోని నందమూరులో ఓ బాలికకు ఓ యువకుడితో వివాహం జరిపించారు. ఈ విషయం తెలిసిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఉదయభాను పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్సై జి.సతీష్ ఆ బాలిక తల్లిపైన, భర్తపైన, అత్తగారిపైన మంగళవారం కేసు నమోదు చేశారు. ఇరు కుటుంబ సభ్యులకు పోలీసులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనారిటీ తీరకుండా వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులు బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని కోరారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీ

దేవరపల్లి: యర్నగూడెం బస్టాండ్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో గల సెల్ షాపులో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు షట్టర్ బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు రూ.5 లక్షల విలువైన సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, రూ.56 వేల నగదుతో ఉడాయించారు. షాపు యజమాని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

లాలనలో.. పాలనలో..

మగువకు సాటి లేదు
- మహిళా అధికారుల పాలనలో పెరవలి మండలం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..



పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన' నిర్వహిస్తున్న మహిళా అధికారులు (ఫైల్)

పెరవలి: పిల్లలను లాలించడంలోనే కాదు.. ప్రజలను పాలించడంలో కూడా తాము ఏమాత్రం తీసిపోమని మహిళలు నిరూపిస్తున్నారు. పురుషులతో పోలిస్తే మహిళలకు ఓపిక, సహనం ఎక్కువ. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడంలోనూ వారు దిట్టలు. ఎలాంటి విఘ్నాలు లేకుండా అధికారిక కార్యక్రమాలను విజయవంతం చేస్తారు. పెరవలి మండలంలో మహిళా అధికారులే ఇందుకొక ఉదాహరణ. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం ఎక్కువ. స్థానిక సంస్థల ఎన్నికల్లోను, నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ వారికి 50 శాతం కేటాయించింది. అదే రీతిలో పెరవలి మండల సింహభాగం పాలనా బాధ్యతలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకే అప్పగించింది. గ్రామ సచివాలయ కార్యదర్శుల నుంచి తహసీల్దార్, ఎంఈఓ, వైద్యాధికారి, సీడీపీఓ, వ్యవసాయాధికారి.. ఇలా ఒకటేమిటి మండలంలోని ప్రధాన కార్యాలయాల అధిపతులు అందరూ మహిళలే. అంతే కాదు. మండలంలోని మెజారిటీ ప్రజాప్రతినిధులు కూడా మహిళలే. మండలంలోని మొత్తం 20 ఎంపీటీసీ స్థానాల్లో 10 మంది మహిళలే. జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని. మండల ప్రత్యేకాధికారిగా కూడా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి వ్యవహరిస్తున్నారు. నిడదవోలు, ఉండ్రాజవరం ఎంపీపీలు మహిళలే. జిల్లాలోనే అత్యధిక మహిళా ఉద్యోగులతో పాటు మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న ఏకైక నియోజకవర్గం నిడదవోలు.

14 సంవత్సరాలుగా ప్రజా సేవలో..



భీమడోలు డిప్యూటీ తహసీల్దార్‌గా 2009లో విధుల్లో చేరాను. 2014లో ప్రమోషన్ పొంది పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించాను. ప్రత్తిపాడు, నరసాపురం, పోడూరు, ఇరగవరం మండలాల తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాను. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిజాయితీగా వ్యవహరిస్తాను. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పలు అవార్డులు, రివార్డులు లభించాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

–టి.రాజరాజేశ్వరి, తహసీల్దార్, పెరవలి

చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్‌గా..



మచిలీపట్నంలో చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్‌గా 2003లో విధుల్లో చేరాను. 2021లో సీడీపీఓగా పదోన్నతి పొంది పెరవలి మండలంలో బాధ్యతలు చేపట్టాను. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటాను. ఉన్నతాధికారుల మన్ననలతో పాటు పలు అవార్డులు కూడా లభించాయి.

–ఎం. శ్రీలక్ష్మి, సీడీపీఓ, పెరవలి

టీచర్‌గా ప్రస్థానం



సమిశ్రగూడెం హైస్కూల్లో 1988లో టీచర్‌గా చేరాను. 2009లో ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి పొందాను. పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డులు లభించాయి. 2017లో ఎంఈఓగా ప్రమోషన్ లభించింది. విధి నిర్వహణలో కచ్చితంగా ఉంటాను.

–డి. హైమావతి, ఎంఈఓ

2017 నుంచి సేవలు



వైద్యురాలిగా 2017లో ప్రభుత్వ సర్వీసులో చేరాను. రంపచోడవరం, రాజమహేంద్రవరం మండలాల్లో ఐదున్నరేళ్లు రోగులకు సేవలు అందించాను. ఉత్తమ వైద్యాధికారిణిగా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం పొందాను. ప్రస్తుతం కానూరు పీహెచ్‌సీలో సేవలు అందిస్తున్నాను.

–పి.తేజశ్రీ, వైద్యాధికారి, కానూరు పీహెచ్‌సీ

రైతులకు సేవలు అందిస్తూ..



ఏవోగా 2009లో తాడేపల్లిగూడెంలో విధుల్లో చేరాను. 2011లో ఉండ్రాజవరం మండలానికి ఏవోగా బదిలీ అయ్యాను. 2022లో అక్కడి నుంచి పెరవలి మండలానికి బదిలీ అయి రైతులకు సేవలు అందిస్తున్నాను.

–ఎ. మేరీ కిరణ్, ఏవో, పెరవలి

కనకదుర్గ.. సేంద్రియ సాగుకు స్ఫూర్తి



సేంద్రియ సాగు చేస్తున్న పొలంలో కనకదుర్గ

నల్లజర్ల: ఆమె చదివింది ఎనిమిదో తరగతే. అయినా ఒక గ్రామాన్నంతా ఏకతాటిపైకి తెచ్చి ప్రకృతి వ్యవసాయం చేయిస్తోంది. గ్రామ రైతులందరూ తమకున్న దాంతో ఎంతోకొంత భూమిలో ప్రకృతి వ్యవసాయం చేసేలా తీర్చిదిద్దింది. ఆమె నల్లజర్ల మండలం సింగరాజుపాలెంకు చెందిన మారం కనకదుర్గ. తనకున్న కొద్దిపాటి భూమిలో ఆరేళ్ల క్రితం సేంద్రియ సాగు ప్రారంభించింది. ఒకే రకమైన పంటను నమ్ముకొని రైతులు నష్టపోకుండా భిన్నంగా ఆలోచించి మిశ్రమ పంటల సాగు చేపట్టింది.సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధిస్తూ మంచి లాభాలు పొంది, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. వరి, చెరకుతో పాటు కాయగూరలు, పండ్లు, ఆకుకూరలతో పాటు వాణిజ్య పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తోంది. గ్రామంలోని 200 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 150 మంది రైతులను సేంద్రియ సాగు బాటలోకి తీసుకువచ్చారు. సింగరాజుపాలేన్ని బయో విలేజ్‌గా తీర్చిదిద్దడానికి చేరువలో ఉన్నారు కనకదుర్గ.

ప్రజారోగ్యమే..ప్రథమ కర్తవ్యం

నిత్యం మనం తినే ఆహారం విషతుల్యం అవుతోంది. రసాయన, క్రిమి సంహారక మందుల వినియోగంతో భూసారం నానాటికీ తగ్గుతోంది. భూసార రక్షణతో పాటు ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టాను. మా గ్రామ రైతులు కూడా ఇప్పుడు ఆసక్తి కనబరుస్తున్నారు.సేంద్రియ ఎరువుల తయారీ, వాడకంపై తరచూ అవగాహన, పర్యవేక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–కనకదుర్గ, సేంద్రియ సాగు రైతు, సింగరాజుపాలెం

రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ సస్పెన్షన్

దూబచర్లలో విజిలెన్స్ అధికారుల తనిఖీ



దూబచర్ల రేషన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నల్లజర్ల: దూబచర్ల గ్రామంలోని రేషన్ డిపో, ఎండీయూలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రేషన్ డిపో నంబర్–7లో 155 కిలోల బియ్యం తక్కువగాను, 117 కిలోల చెక్కెర, 143 కిలోల కందిపప్పు, 26 కిలోల పామాయిల్ ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే 125 కిలోల మధ్యాహ్న భోజనం బియ్యం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. దాంతో అధికారులు ఆ డీలరుపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేశారు. ఆ డీలర్ షిప్ బాధ్యతలు నంబర్– 5 డీలర్ ఈపిచర్ల కృష్ణకు అప్పగించారు. అలాగే మొబైల్ వాహనం ద్వారా సరకులు సరఫరా చేస్తున్న ఎండీయూను తనిఖీ చేయగా 20 కిలోల బియ్యం, 12 కిలోల పంచదార ఎక్కువగాను, 13 కిలోల కందిపప్పు తక్కువగాను ఉన్నట్టు గుర్తించారు. దాంతో ఆపరేటర్ ఈపిచర్ల సుబ్బారావును కూడా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కిశోర్, తహసీల్దార్ విజయకుమార్, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దారు సుజాత, వీఆర్వో సూరిబాబు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌తో ఉపాధి అవకాశాలు పుష్కలం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌తో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఆ సమ్మిట్ విజయవంతం కావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చారిత్రాత్మకమైన గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, దాదాపు 20 రంగాల్లో సుమారు ఆరు లక్షల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడాన్ని తట్టుకోలేని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని తలారి తప్పు పట్టారు.రాష్ట్రంలో మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయనే నమ్మకం పారిశ్రామికవేత్తలకు కలిగిందన్నారు. 1000 కిలోమీటర్ల పొడవైన కోస్టల్ కారిడార్ ఉండడంతో వారి ఉత్పత్తుల రవాణాకు అనువైన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని పారిశ్రామిక వేత్తలు విశ్వసిస్తున్నారని వెంకట్రావు అన్నారు.

15 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

- నల్లజర్ల మండలంలో 15 సేకరణ కేంద్రాలు
- అధికారుల సమావేశంలో ఎంపీడీఓ జోగేశ్వరరావు



నల్లజర్ల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జోగేశ్వరరావు

నల్లజర్ల: ఈ రబీ సీజన్‌లో పండిన ధాన్యం సేకరణకు మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ జోగేశ్వరరావు ప్రకటించారు. రబీ ధాన్యం కొనుగోళ్లపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల, గ్రామస్థాయి అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అవుతాయన్నారు. రైతులందరూ ఇప్పటికే ఈకేవైసీ చేయించుకున్నారా? లేదా అన్న విషయాన్ని పరిశీలించాలన్నారు. ధాన్యానికి ప్రభుత్వం చెల్లించే కనీస మద్దతు ధరలు రైతులకు తెలిసేలా ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లను సిద్ధం చేయాలన్నారు. దళారులకు ధాన్యం అమ్మి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా చూడాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లోను ధాన్యం పట్టుబడి సామగ్రి, గోనె సంచులు ఉన్నాయా? లేదా చూసుకోవాలన్నారు. ధాన్యం సేకరణలో ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని ఎంపీడీవో జోగేశ్వరరావు హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఏవో కమల్‌రాజ్ ,సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దారు సుజాత, సహకార సంఘాల అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

పెరవలి: మరో పది రోజుల్లో రబీ వరి కోతలు ప్రారంభం అవుతాయి కాబట్టి, ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆమె మండలంలోని వ్యవసాయాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో ప్రవేశ పెట్టిన యాప్‌లోనే ఈ రబీలో కూడా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రబీలో ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, అందుకనుగుణంగా అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులున్నా ముందుగానే పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏవో ఏ.మేరీ కిరణ్, ఎంపీడీవో రమేష్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

కొవ్వూరు: మండలంలోని ధర్మవరం గ్రామంలో హిందూ శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఆ గ్రామస్తులు మంగళవారం స్థానిక తహసీల్దార్ బి.నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇన్నాళ్లూ చెరువు, కాలువ గట్లు, రోడ్ల పక్కన దహన సంస్కారాలు నిర్వహించే వారమని వారు పేర్కొన్నారు. అవి కూడా ఆక్రమణలకు గురవడంతో గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ సమస్యపై ఇప్పటికే అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందించామన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ఆర్డీవో, కలెక్టర్‌లకు కూడా వినతిపత్రాలు అందజేశామని ధర్మవరం వాసులు తెలిపారు. జుత్తిగ వెంకట్రావు, పెదవేగి అప్పారావు, అరిగెల రాధాకృష్ణ, ఇంజరపు అప్పలాచార్యులు, మీరా లింగంలతో పాటు గ్రామానికి చెందిన పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

10న గోపాలపురం మండల పరిషత్ సమావేశం

గోపాలపురం: గోపాలపురం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

నిడదవోలు రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం ప్రతి నెలా సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో సాగాలి

- మున్సిపల్ కమిషనర్ పద్మావతి
- ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాల్లో మహిళా దినోత్సవం

నిడదవోలు రూరల్: లక్ష్యాల సాధనకు మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి సూచించారు. నిడదవోలు ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. విద్యార్థినులకు మహిళా దినోత్సవంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళాసాధికారిత శాఖ సమన్వయకర్త డాక్టర్ కె.జాస్మిన్, వైస్ ప్రిన్సిపాల్ ఈ.నాగేశ్వరరావు, అకడమిక్ కో–ఆర్డినేటర్ పీఎస్ ప్రవంతి, అధ్యాపకులు హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

నిడదవోలు రూరల్: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మదన గోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు దివ్వెల ఫణి మాధురి పర్యవేక్షణలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మానసిక దివ్యాంగుల హృదయాలయం ఇన్‌చార్జ్ బలగం విశాలాక్షిని సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ వనిత క్లబ్ సభ్యులు కేదారిశెట్టి సునీత, జయవరపు లక్ష్మి, పెరుమళ్ల విజయ, గొల్లపూడి గాయత్రి, జవ్వాది శిరీష, పెనుగొండ రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తాగునీరు అందించండి

నిడదవోలు రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ప్రయాణికులకు తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డిపో సాధన సౌకర్యాల పోరాట కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు కోరారు. నిడదవోలు ఆర్టీసీ డిపోలో అందుతున్న సౌకర్యాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దాతల సాయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నిర్వహణను డిపో అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు అల్పాహారం అందజేత

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న 110 మంది ఇంటర్ విద్యార్థులకు మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు మంగళవారం అల్పాహారం అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకూ కూడా నేటి నుంచి అల్పాహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ సభ్యులు వి.చంద్రయ్య, సీహెచ్ ఆంజనేయులు, పెమ్మాడి దుర్గాప్రసాద్, సనపల రాజశేఖర్, అప్పన చంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

సుందరేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు

కొవ్వూరు: ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా మంగళవారం స్థానిక గోష్పాద క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి వారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి అమ్మవారిని ముత్యాలతో సుందరంగా అలంకరించారు.ఈ పౌర్ణమి రోజు అమ్మవారిని దర్శించుకుంటే చంద్రగ్రహణ దోషాలు తొలగుతాయని ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాస శాస్త్రి తెలిపారు. సుందర గణేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీ హోమం

గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో మంగళవారం చండీహోమం నిర్వహించారు. లోక కళ్యాణార్థం ప్రతి పౌర్ణమి నాడూ చండీ హోమాన్ని నిర్వహిస్తున్నామని ఆత్మీయ హితకారిణీ సమాజం వ్యవస్థాపకుడు ఎస్ఎస్ వాజ్‌పేయ్ తెలిపారు. వాజ్‌పేయ్, చామమర్తి విశ్వనాథరావు దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. పండితులు కోండూరి మణికిరణ్ శర్మ, వేదుల సతీష్ శర్మ హోమం చేయించారు. పాలకోడేటి సత్యనారాయణమూర్తి, మేడూరి సూర్యనారాయణ, వరలక్ష్మి, నళిని, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

దానవాయిస్వామి వారి ఆలయంలో..

చాగల్లు: స్థానిక చిలకమ్మ బీడులో నిర్మించిన జ్ఞానశక్తి దానవాయిస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు మంగళవారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అగ్నిమథనం, అష్టకలశ స్థాపన, సప్తకలశ స్థాపన, నవకలశ స్థాపన, జలాధివాసం, సర్వదేవతా ఆవాహనం, మహాశాంతి హోమం వంటి పూజలు నిర్వహించారు. ఈనెల 8న విగ్రహ ప్రతిష్ఠ, ప్రథమారాధన, పీఠారోహణ, కళావాహనం పూజలు, అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



కొవ్వూరు జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీ హోమం

వైభవంగా శ్రీపుష్పోత్సవం

ఉండ్రాజవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో స్వామివారికి వైభవంగా పుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల లక్ష్మణాచార్యులు(అయ్యప్ప) ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో ఆలంకరించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి చక్రస్నానం, వసంతోత్సవం జరిగాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి మీసాల వెంకట్రావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.